క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. మానవపాడు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బోయ నారాయణకు రూ.25,500 చెక్కు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ

మల్దకల్: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కంది విత్తనాలను ఉచితంగా ఏఓ రాజశేఖర్ రైతులకు అందజేశారు. మండలానికి మొత్తం 405 పాకెట్లు (4కేజీల) కంది విత్తనాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఖాజపాష, కిషోర్, భాస్కర్, జోహాన, పల్లవి రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అలంపూర్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటస్వామి అన్నారు. పట్టణంలో సైబర్ మోసాలపై పోలీసులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సమాజంలో రోజురోజుకు సైబర్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు అధికమవుతున్నట్లు పేర్కొన్నారు. డబ్బులు పోయాక బాధపడటం కంటే ముందే అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఆంజనేయులు, సురేష్, పరుశురాముడు పాల్గొన్నారు.

ప్రింటింగ్ మిషన్ ఏర్పాటు చేయాలి

అలంపూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రింటింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యాలయంలో ఏడాది కాలంగా ప్రింటింగ్ మిషన్ లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తక్షణమే ప్రింటింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతివాటం

మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతు శ్రీకాంత్‌రెడ్డి పోస్టాఫీసు ఖాతా నుంచి తపాలా శాఖలోని ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రూ.4500 డ్రా చేసినట్లు పోస్టుమాస్టర్ రామనాథ్‌రెడ్డి నిర్ధారించారు. బుధవారం మండల కేంద్రంలోని తపాలా శాఖ జిల్లా ఏఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో విచారణ చేసి రైతు శ్రీకాంత్‌రెడ్డికి రూ.4,500 రికవరీ చేసి డబ్బును అందజేశారు. ఈ సందర్భంగా తపాలాశాఖలో అవినీతి సరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మసీదులో ఆవాజ్ రాష్ట్ర 3వ మహా సభలను జయప్రదం చేయాలని బుధవారం ఆవాజ్ కమిటీ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర నాయకులు జబ్బార్ మాట్లాడుతూ.. ఈ నెల 13, 14న గద్వాల్‌లో జరిగే రాష్ట్ర మహాసభలకు అన్ని పార్టీల నాయకులు, ప్రజాస్వాములు, లౌకికవాదులు, మైనార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అతికూర్, రహిమాన్, రహిమతుల్లా, రఫీక్, హుస్సేన్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి అభిరామ్ హకీంపేట క్రీడా పాఠశాలకు ఎంపికైట్లు ఇన్‌చార్జి ఎంఈఓ సురేశ్ తెలిపారు. బుధవారం అభిరామ్‌ను ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పీడీ సుహాసిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటికి రెంటికీ అవస్థలే

- పాఠశాలల్లో అసంపూర్తిగా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు
- బిల్లుల చెల్లింపులో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మానవపాడులో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

మానవపాడు: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంతో నీరుగారుతోంది. మండల పరిధిలోని పాఠశాలల్లో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇటు విద్యార్థులు అటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. గతేడాది ఆయా పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. అయితే బిల్లులు చెల్లింపు జాప్యంతో పనులు మధ్య నిలిచిపోయాయి. ప్రస్తుతం బడులు పునః ప్రారంభమై పక్షం రోజులుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిధిలో

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 3, ఒక కేజీబీవీ పాఠశాలలో, ప్రాథమికోన్నత పాఠశాలలు 10, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 4 ఉండగా మొత్తం విద్యార్థుల 2,481 మంది విద్యనభ్యసిస్తున్నారు.

అసంపూర్తిగా నిర్మాణాలు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నిపాడులోని జిల్లా పరిషతో ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ వరకు విద్యనభ్యసిస్తుండగా సరిపడా మూత్రశాలలు, విద్యార్థులు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నట్లు బాలికలు వాపోతున్నారు.

ఆరుబయటకే వెళ్తున్నారు

గోకులపాడు, బోరవెల్లి, పల్లెపాడులో చందూరు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, కొర్విపాడు పాఠశాలలో మరుగుదొడ్లు లేక ఆరుబయటకే వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల సమయంలో మూత్రానికి వెళ్లాలన్నా సమీపంలోని విద్యార్థులు ఇళ్లకు రావాల్సి వస్తోందని లేక ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తడి ప్రదేశాల్లో బయటకు వెళ్లినపుడు విషపురుగులు, ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరిపడినన్ని మరుగుదొడ్లు, మూత్రశాలలు సమస్య తీవ్రంగా ఉంది. 450 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా 250 మంది విద్యార్థినులకు కేవలం 2 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు విద్యార్థినులు వాపోతున్నారు. బాలురు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మానవపాడులో మరుగుదొడ్ల వద్ద క్యూలో నిల్చున్న బాలికలు



పల్లెపాడు పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి

ఆరుబయటకు వెళ్లాలి..



పాఠశాల సమయంలో మూత్రానికి, మరుగుదొడ్డికి వెళ్లాలంటే ఆరుబయటికే వెళ్లాల్సి వస్తోంది. పాఠశాలలో బాలురకు మరుగుదొడ్లు లేవు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్లు కూడా నిర్మాణాలు పూర్తి కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- అఖిల్‌సాయి, పదో తరగతి మానవపాడు

క్యూలో నిలబడాలి..



పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు విద్యార్థులకు సరిపడా లేవు. దాదాపు 200 మంది బాలికలకు రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. క్యూలైన్‌లో నిలబడి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బాత్రూంల సమస్యను పరిష్కరించాలి.

- అశ్విని, పదో తరగతి, మానవపాడు

చర్యలు తీసుకుంటాం

మండల పరిధిలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరిపడినన్ని మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి మా దృష్టికొచ్చింది. మరుగుదొడ్లు అందుబాటులో లేని పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- శివప్రసాద్, ఎంఈఓ, మానవపాడు

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ గోకారి

రాజోళి: మండలంలోని నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రం రాజోళిలో ఎస్ఐ గోకారి, ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌తో కలిసి మాట్లాడారు. ప్రస్తుతం గ్రామాల్లో వర్షాల వల్ల జరిగే నష్టాలను, ప్రమాదాల నివారణ కోసం కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పాత మిద్దెలు, ప్రమాదకర భవనాల్లో నివాసముంటున్న వారిని తక్షణమే ఖాళీ చేయించాలని సూచించారు. కమిటీ సభ్యులు ఆయా గ్రామాల్లోని ప్రజలు అందుబాటులో ఉంటూ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి కోరారు. బుధవారం బీజేపీ నాయకులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐకు జయన్నకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలో నిర్వహించే సంతకు అయిజ, మల్దకల్, గట్టు, వడ్డెపల్లి మండలాల ప్రజలు అధిక మొత్తంలో తరలివస్తున్న నేపథ్యంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, రామ్, రాఘవేంద్ర, సంతోష్, వెంకటేష్, రాముడు, వేణు, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో మోస్తరు వాన



మానవపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో నిలిచిన వర్షపునీరు

అయిజ: మండల కేంద్రంలో బుధవారం కురిసిన వర్షానికి పట్టణంలోని వివిధ కాలనీలు నీటిలో మునిగాయి. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ప్రధాన రోడ్డు పక్కన మురుగు నిలవడంతో స్థానికులు నానాఅవస్థలు పడ్డారు. రాయచూర్ రోడ్డు సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన లోతట్టు ప్రదేశాలు చెరువులను తలపిస్తున్నాయి.

ప్రధాన రోడ్డు జలమయం

రాజోళి: శాంతిగనర్ నుంచి కోవెలదిన్నెకు వెళ్లే ప్రధాన రోడ్డు జలమయంగా మారుతుంది. చిన్న వర్షం కురిసినా రోడ్డుపై మోకాళ్ల లోతు నీరు చేరి నడిచేందుకు కూడా వీలు లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వాహనదారులు పేర్కొన్నారు.

మండలంలో భారీ వర్షం

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో మండంలోని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మంగళవారం రాత్రి 24 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ తెలిపారు.



కోవెలదిన్నె- శాంతిగనర్ రోడ్డుపై మోకాలి లోతులో నిలిచిన వర్షపునీరు



అయిజలో రాయచూర్ రోడ్డు పక్కన నిలిచిన వర్షపునీరు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అలంపూర్: అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో బుక్కాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బాలజీ కృష్ణకుమార్ తెలిపారు. ఈ నెల 1న జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగగా అండర్- 10, అండర్- 12 విభాగంలో నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 6న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను పీఈటీ దేవేంద్ర, ఉపాధ్యాయులు ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు.

ఘనంగా పోలమ్మ ఉర్సు



ధరూరు: మండల పరిధిలోని గుడ్డెందొడ్డి ఉర్సులో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ హాజరై బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, నాయకులు బలరామ్‌నాయుడు, మల్దకల్, మునెప్ప, చిన్న రాముడు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కేటీదొడ్డి: ఇంటి తాళం పగులగొట్టి బంగారం, నగదు చోరీ చేసిన ఘటన మండలంలోని మల్లాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మల్లాపురం గ్రామానికి చెందిన గుడిసె వీరేష్ బుధవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. వీరేష్ కుమార్తె మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి తల్లిదండ్రులలకు ఫోన్‌లో సమాచారమిచ్చింది. ఇంటికి చేరుకున్న వారు బీరువా పగులగొట్టి తులం బంగారు ఆభరణాలు రూ.20 వేలు నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. వీరేష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

ఉండవెల్లి: మండల కేంద్రంలో హమాలీ కార్మికులతో కలిసి ఈ నెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని బుధవారం సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు కరపత్రాలు విడుదల చేశారు. హమాలీలు, డ్రైవర్లు, కార్మికులు సమ్మెలో భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరసింహ, వెంకట్రాముడు, పాండు, అంజి, మహేష్, శ్రీను, రాముడు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కదిలిన మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

అయిజ: సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'పొంచి ఉన్న ప్రమాదం' కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, ఏఈ రాజశేఖర్, అసిస్టెంట్ ఏఈ వినోద్ శిథిల డ్రైనేజీ, ప్రమాదభరితంగా ఉన్న సీసీరోడ్డును పరిశీలించారు. మరమ్మతు చేసేందుకు కొలతలు తీసుకున్నారు. మొత్తం 50 మీటర్ల డ్రైనేజీ కాల్వ, అదనపు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.4.30 లక్షలు అంచనా విలువకు ప్రణాళిక తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా ఉండాలి



మల్దకల్‌లో కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

అలంపూర్: గ్రామస్థాయి అధికారులు యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామీణ స్వచ్ఛ సర్వేక్ష- 2025, విపత్తు నివారణ, ప్లాంటేషన్‌పై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామస్థాయి అధికారులు శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, పాఠశాలలు, వంతెనలు, షెడ్లను గుర్తించాలన్నారు. ప్రతి గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాంగింగ్ చేయాలన్నారు. మురుగు నిల్వకుండా చూడాలన్నారు. వర్షాలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలను, తెగిన విద్యుత్ తీగలను గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రిహాబిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచాలన్నారు. నదీతీర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు వర్షాలు పడుతున్న సమయంలో చేపల వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. వాగులు, శిథిలావస్థలో ఉన్న వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ టీం పర్యటిస్తున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు బహిరంగ మలవిసర్జనకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో బడి బయటి పిల్లలు ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రతి గ్రామంలో 2,600 మొక్కలు నాటాలన్నారు. 5 ఎకరాల పొలం ఉన్న రైతులు ఉద్యానవన పంటలు సాగుకు మొగ్గు చూపే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ మంజుల, ఐసీడీఎస్, ఏఈ, ఐకేపీ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

మల్దకల్: గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. బుధవారం మల్దకల్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం పరచాలన్నారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న నర్సరీలు, కూలీ పనులు చేసిన ప్రదేశాల్లో సూచికబోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మావతి

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

ఎర్రవల్లి: మండల పరిధిలోని జింకలపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు ఉమేశ్వరయ్య రూటే వేరుగా ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు. పాఠశాలకు ఏ రోజు కూడా సమయపాలన పాటించడం లేదని, వచ్చినా విద్యార్థులకు పాఠాలు చెప్పడం పక్కనబెట్టి ఫోన్‌లో సమయాన్ని వృథా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల ఎలక్ట్రిక్ బైక్‌ని కొన్న పంతులు పాఠశాలలో రోజు బైక్‌కు చార్జింగ్ పెట్టడం గమనార్హం. ఈ నేపథ్యంలో బుధవారం విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని మందలించారు. ఇటీవల బైక్‌కు చార్జింగ్ పెట్టిన బోర్డు కేబుల్ తగిలి అదే పాఠశాలకు చెందిన ఓ బాలుడికి విద్యుత్ షాక్ తగిలినా ఉపాధ్యాయుడి తీరు మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎంఈఓకు ఫిర్యాదు చేసినా, పలుమార్లు హెచ్చరించినా ఆయన తీరులో మార్పు కలగడం లేదన్నారు. దీనిపై మండల విద్యాధికారి అమీర్‌పాషను సాక్షి వివరణ కోరగా ఆయనపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు రాగా పాఠశాలను సందర్శించి విచారణ చేసినట్లు తెలిపారు. నిబంధలనకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేయాలి



ధరూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న జిల్లా అధ్యక్షుడు ఇక్బాల్ పాషా

ధరూరు: రైతుల సమస్యలు పరిష్కరించేందుకు పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 5న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షుడు ఇక్బాల్ పాష అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు వ్యవసాయ పరంగా పూర్తిగా నష్టపోయిన ప్రాంతమని గుర్తు చేశారు. నీటి వాటాలు, సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ అడుగడుగునా అన్యాయానికి గురైన ప్రాంతమన పేర్కొన్నారు. సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామిరెడ్డి, చిన్న రాముడు, కృష్ణయ్య, నర్సింహులు, సవారన్న, వెంకటన్న, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

గట్టు: నడిగడ్డలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని పాలమూరు అధ్యయన నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



సాసనూలులో నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కేటీదొడ్డి: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాల, తూర్పుతండా, పూజారి తండా, గువ్వలదిన్నె పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీలు చేశారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాపయ్య, యుగంధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు అందజేత

ఎర్రవల్లి: మండల పరిధిలోని సాసనూలు ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారుర. గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పెద్ద వీరన్న పాఠశాలలోని 60 మంది చిన్నారులకు రూ. 6వేల విలువగల నోట్ పుస్తకాలు, పలకలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ కల్పిస్తున్న వసతులను సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు జయరామయ్య, బాబురెడ్డి, చాంద్‌బాష, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

ధరూరు: మండల పరిధిలోని మాల్‌దొడ్డి, గుడ్డెందొడ్డి పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు రిజిస్టర్లలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని పేర్కొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల - కె.నీలాంజనుడు - 9642913894
అలంపూర్/అయిజ - ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బార్ లాల్ : 9553955603